క్లుప్తంగా

వైఎస్సార్‌సీపీ నేతకు భరోసా



నెల్లూరు(బారకాసు) : నగరంలోని 42వ డివిజన్‌కు చెందిన వైఎస్సార్‌సీపీ నాయకుడు అబ్దుల్ మస్తాన్ గురువారం అనారోగ్యానికి గురయ్యారు. వెంటనే ఎమ్మెల్సీ చంద్రశేఖర్‌రెడ్డి తన కారులోనే ఓ ప్రైవేటు హాస్పిటల్‌కు తీసుకెళ్లి చేర్పించారు. మెరుగైన వైద్యం అందించాలని డాక్టర్లను కోరారు. పార్టీ తరఫున అండగా ఉంటానని మస్తాన్‌కు చంద్రశేఖర్‌రెడ్డి భరోసా కల్పించారు.

గంధ మహోత్సవంలో ఎమ్మెల్సీ



ప్రత్యేక ప్రార్థనలు చేస్తున్న ఎమ్మెల్సీ చంద్రశేఖర్‌రెడ్డి

నెల్లూరు(బారకాసు) : నగరంలోని 52వ డివిజన్, రంగనాయకులపేటలో ఉన్న దర్గాలో గంధ మహోత్సవానికి ఎమ్మెల్సీ, వైఎస్సార్‌సీపీ సిటీ నియోజకవర్గ ఇన్‌చార్జి పర్వతరెడ్డి చంద్రశేఖర్‌రెడ్డి హాజరయ్యారు. వైఎస్సార్‌సీపీ నాయకులు మాబాషా, రమేష్ ఆహ్వానం మేరకు గురువారం జరిగిన గంధ మహోత్సవానికి ఆయన హాజరై ప్రత్యేక ప్రార్థనలు జరిపారు.

డీసీఓ కార్యాలయంలో విజిలెన్స్ వారోత్సవాలు



నెల్లూరు(వీఆర్సీసెంటర్) : నగరంలోని డీసీఓ కార్యాలయంలో విజిలెన్స్ వారోత్సవాలను శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా డీసీఓ గుర్రప్ప మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర పథకాలను పారదర్శకంగా అందించడమే లక్ష్యమని తెలిపారు. అనంతరం సిబ్బందిచే ప్రతిజ్ఞ చేయించారు.

పెట్రోలింగ్ చేపట్టాలి

నెల్లూరు(వీఆర్సీసెంటర్) : 33 కేవీ, 11 కేవీ విద్యుత్ లైన్లలో సిబ్బంది పెట్రోలింగ్ చేపట్టాలని ఎస్పీడీసీఎల్ జిల్లా సర్కిల్ ఎస్‌ఈ విజయన్ ఆదేశించారు. నగరంలోని విద్యుత్‌భవన్‌లో విద్యుత్‌శాఖ ఈఈ, డీఈఈ, ఏఈలతో ఆయన శుక్రవారం టెలీ కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, వినియోగదారులకు మెరుగైన విద్యుత్ సరఫరా అందించేందుకు విద్యుత్ లైన్లలో అంతరాయాలు రాకుండా పెట్రోలింగ్ చేపట్టి సమస్యలను గుర్తించి మరమ్మతులు చేపట్టాలని ఆదేశించారు. విద్యుత్ బకాయిలపై దృష్టి సారించాలని, అదేవిధంగా విద్యుత్ వృథాను అరికట్టేందుకు ప్రత్యేక చొరవ చూపాలని తెలిపారు. సమావేశంలో ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్(టెక్నికల్) శేషాద్రి బాలచంద్ర, డీఈఈ మునీంద్ర, ఏఈలు తిరుపతయ్య, నరసింహారావు పాల్గొన్నారు.

'నామినేటెడ్ పదవుల్లో అన్యాయం చేశారు'

నెల్లూరు రూరల్ : రాష్ట్రంలో చేనేత జనాభా 16 లక్షలు ఉన్నా దేవాంగ చేనేత వర్గానికి నామినేటెడ్ పదవుల్లో తీవ్ర అన్యాయం జరిగిందని జిల్లా దేవాంగ చేనేత నాయకులు యరా ధనంజయ, చప్పరం మల్లికార్జునరావు, కన్నా బ్రహ్మయ్య, మారం మురళీకృష్ణలు శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. కేవలం ఒక చేనేత వర్గానికే పదవులు ఇచ్చారని, మిగిలిన వారికి ఒక్క నామినేటెడ్ పదవి కూడా ఇవ్వలేదన్నారు. సీఎం చంద్రబాబు తమకు న్యాయం చేయాలని కోరారు.

నిత్యావసర సరుకుల పంపిణీ



నెల్లూరు(అర్బన్) : నగరంలోని రూట్స్ చారిటబుల్ ట్రస్ట్ కార్యాలయంలో జొన్నవాడకు చెందిన కేన్సర్ బాధితుడు మోహన్ కుటుంబానికి బియ్యం, ఇతర నిత్యావసర సరుకులను శుక్రవారం పంపిణీ చేశారు. కార్యక్రమంలో ట్రస్ట్ చైర్మన్ రసూల్, పీహెచ్‌పీ గౌరవాధ్యక్షుడు జయప్రకాష్, విశ్రాంత ఏఎస్సై మహబూబ్‌బాషా పాల్గొన్నారు.

4 నుంచి ఎస్‌ఏఎంపీ పరీక్షలు

నెల్లూరు (టౌన్) : సెల్ఫ్ అసెస్‌మెంట్ మోడల్ పేపర్-2 (ఎస్‌ఏఎంపీ) పరీక్షలు ఈనెల 4వ తేదీ నుంచి ప్రారంభం కానున్నట్లు డీఈఓ ఆర్.బాలాజీరావు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లాలోని అన్ని యాజమాన్య పాఠశాలల్లో పరీక్షలను తప్పనిసరిగా నిర్వహించాలన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో చదివే విద్యార్థులకు ఎస్సీఈఆర్టీ ద్వారా ప్రశ్నపత్రాలు అందజేస్తామన్నారు. ప్రైవేటు పాఠశాలల యాజమాన్యాలు సొంత ప్రశ్నపత్రాలతో పరీక్షలు జరుపుకోవాలన్నారు.

అడిగేదెవరు.. అడ్డుకునేదెవరు

నగరంలోని ప్రధాన రహదారుల్లో దుకాణదారులు ఇష్టానుసారంగా వ్యవహరిస్తున్నారు. ప్రతి షాపుల ముందు కొంత రోడ్డును, ఫుట్‌పాత్‌లను కూడా వదలకుండా ఆక్రమించేసి వ్యాపారాలు సాగిస్తున్నారు. మమ్మల్ని అడిగేదెవరు.. అడ్డుకునేదెవరు అన్నట్లుగా వ్యవహరిస్తున్నా అధికారులు పట్టించుకోవడం లేదు.

- ఆక్రమణల చెరలో బజార్లు
- రోడ్లను ఆక్రమించి నిర్మాణాలు
- పట్టించుకోని అధికారులు
- నిత్యం ట్రాఫిక్ అంతరాయంతో ప్రజలకు ఇక్కట్లు



ఆత్మకూరు బస్టాండ్ వద్ద ఫుట్‌పాత్‌ను ఆక్రమించి సాగిస్తున్న వ్యాపారాలు

నెల్లూరు (పొగతోట) : నగరంలోని బజార్లు రోజు రోజుకు బక్కచిక్కి పోతున్నాయి. ఆక్రమణదారులు రోడ్డుకు ఇరువైపులా స్థలాలను ఆక్రమించి నిర్మాణాలు చేపట్టడంతో వీధులు కుచించుకుపోతున్నాయి. నెల్లూరు నగరంలోని బాలాజీనగర్, ఏసీ నగర్, చిన్నబజార్, అపోలో సెంటర్, చిల్డ్రన్స్ పార్కు, మినీ బైపాస్, ట్రంకురోడ్డు వంటి ప్రతి ప్రాంతంలోనూ ఆక్రమణలు అధికమయ్యాయి.

పెరిగిన వాహనాల వినియోగం

నగరంలో జనాభా పెరిగిపోవడంతో వాహనాల రద్దీ అధికమైంది. నిత్యం ట్రాఫిక్ అంతరాయాలతో ప్రజలు నానా ఇబ్బందులు పడుతున్నారు. నగర పరిధిలో నెల్లూరు సిటీ, నెల్లూరు రూరల్ నియోజకవర్గాలు ఉన్నాయి. సుమారు 8 లక్షలకుపైగా జనాభా జీవనం సాగిస్తున్నారు. వీరితో పాటు చుట్టు పక్కల గ్రామాల నుంచి నిత్యం లక్షకు పైగా ప్రజలు నగరానికి రాకపోకలు సాగిస్తున్నారు. ప్రజల వాహనాల వినియోగం కూడా అధికమైంది. దీంతో నగరంలో ఉదయం 9 గంటల నుంచి 11 వరకు, మధ్యాహ్నం 2 నుంచి 3 గంటల వరకు, సాయంత్రం 5 నుంచి రాత్రి 8 గంటల వరకు ప్రధాన కేంద్రాల్లో ట్రాఫిక్ అంతరాయం కలుగుతోంది.

ఆయా ప్రాంతాల్లో..

నగరంలోని ఆత్మకూరు బస్టాండ్ నుంచి అయ్యప్ప గుడి వరకు రోడ్డుకు ఇరువైపులా ఆక్రమణలు అధికమయ్యాయి. దుకాణదారులు ఉన్న స్థలాన్ని కాకుండా రోడ్డు వైపు ఉండే స్థలాలను ఆక్రమించి నిర్మాణాలు చేపడుతున్నారు. అవి కాకుండా తమ షాపులకు సంబంధించిన బోర్డులను రోడ్లపై పెడుతున్నారు. గతంలో షాపులు ముందుకు జరపకుండా డ్రెయినేజీ కాలువను ఇరువైపులా నిర్మించారు. దుకాణదారులు డ్రెయినేజీ కాలువను సైతం ఆక్రమించి ముందుకు నిర్మాణాలు చేపట్టి ప్రజలను నిత్యం ఇబ్బందులకు గురి చేస్తున్నారు. గతంలో బాలాజీనగర్ విశాలంగా ఉండేది. ప్రస్తుతం రోడ్డుకు ఇరువైపులా ఆక్రమణలు అధికం కావడంతో వాహనదారులు, ప్రజలు నానా ఇబ్బందులు పడుతున్నారు. ట్రంకురోడ్డులో ట్రాఫిక్ అధికంగా ఉండడంతో మినీ బైపాస్‌ను అందుబాటులోకి తీసుకొచ్చారు. ప్రస్తుతం మినీ బైపాస్ కూడా ఆక్రమణలకు గురవుతోంది. ఇక్కడ పెద్ద పెద్ద షాపింగ్ మాల్స్, హోటల్స్‌ను ఏర్పాటు చేశారు. దీంతో మినీ బైపాస్ రోజు రోజుకు కుచించుకు పోతోంది. ఇక్కడి షాపింగ్ మాల్స్‌కు పార్కింగ్ ప్రాంతాలు లేకపోవడంతో రోడ్డుపైనే వాహనాలను నిలుపుదల చేస్తున్నారు. దీంతో వాహనదారులు, ప్రజలు నానా అవస్థలు పడుతున్నారు. కార్పొరేషన్ అధికారులు స్పందించి ఆక్రమణలు తొలగించేలా చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.



సుబేదార్‌పేటలో సగం రోడ్డును ఆక్రమించి ఏర్పాటు చేసిన దుకాణాలు



చిల్డ్రన్స్‌పార్కు రోడ్డులో ఇదీ పరిస్థితి

సర్దార్ జీవితం స్ఫూర్తిదాయకం



సర్దార్ వల్లభ్‌భాయ్ పటేల్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న కలెక్టర్, జేసీ



సర్దార్ విగ్రహానికి పూలమాలలు వేసిన ఎస్పీ, ఏఎస్పీ తదితరులు

- ఘనంగా జాతీయ ఐక్యతా దినోత్సవం

నెల్లూరు (దర్గామిట్ట): ఐక్యభారత నిర్మాత సర్దార్ వల్లభ్‌భాయ్ పటేల్ జీవితం స్ఫూర్తిదాయకమని కలెక్టర్ ఆనంద్ అన్నారు. కలెక్టరేట్లోని తిక్కన ప్రాంగణంలో సర్దార్ పటేల్ జయంతిని పురస్కరించుకుని జాతీయ ఐక్యతా దినోత్సవం ఘనంగా నిర్వహించారు. పటేల్ చిత్రపటానికి కలెక్టర్‌తో పాటు జేసీ, అధికారులు పుష్పాంజలి ఘటించి నివాళులర్పించారు. అనంతరం దేశ సమగ్రతను, సార్వభౌమత్వాన్ని కాపాడుతామని విద్యార్థులు, అధికారులు ప్రతిజ్ఞ చేశారు. కలెక్టర్ మాట్లాడుతూ భారతదేశ ఏకీకరణలో సర్దార్ పటేల్ కీలకపాత్ర పోషించారని, దేశ అభివృద్ధికి బాటలు వేసిన ఘనత కూడా ఆయనకే దక్కుతుందన్నారు. జేసీ కార్తీక్, నెల్లూరు ఆర్డీఓ అనూష, జిల్లా బీసీ సంక్షేమాధికారి ప్రసూన, కలెక్టరేట్ ఏఓ విజయ్‌కుమార్ పాల్గొన్నారు.

స్ఫూర్తిగా తీసుకోవాలి

నెల్లూరు(క్రైమ్) : ఉక్కుమనిషి సర్దార్ వల్లభ్‌భాయి పటేల్ సంకల్పాన్ని ప్రతిఒక్కరూ స్ఫూర్తిగా తీసుకోవాలని జిల్లా ఎస్పీ జి.కృష్ణకాంత్ పిలుపునిచ్చారు. అమరవీరుల సంస్మరణ వారోత్సవాలు, సర్దార్ వల్లభ్‌భాయి పటేల్ జయంతిని పురస్కరించుకుని పోలీసుశాఖ ఆధ్వర్యంలో గురువారం రన్ ఫర్ యూనిటీ కార్యక్రమం నిర్వహించారు. పోలీసు కవాతు మైదానం నుంచి సర్దార్ వల్లభ్‌భాయి పటేల్ నగర్ వరకు రన్ సాగింది. అనంతరం ఆయన విగ్రహానికి పోలీసులు, సిబ్బంది పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించి దేశ అంతర్గత భద్రతకు కృషిచేస్తామని ప్రతిజ్ఞ చేశారు. ఎస్బీ, నగర, రూరల్, ఏఆర్, హెచ్‌జీ డీఎస్పీలు ఎ.శ్రీనివాసరావు, డి.శ్రీనివాసరెడ్డి, ఘట్టమనేని శ్రీనివాసరావు, వెంకటేశ్వరరావు, సంకురయ్య తదితరులు పాల్గొన్నారు.

సేవాభావాన్ని అలవర్చుకోవాలి



మాట్లాడుతున్న పెద్దాస్పత్రి సూపరింటెండెంట్ సిద్ధానాయక్

నెల్లూరు(అర్బన్) : పేదలు, అభాగ్యులకు సేవ చేయడాన్ని యువత అలవర్చుకోవాలని ప్రభుత్వ పెద్దాస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ సిద్ధానాయక్ అన్నారు. కేంద్ర యువజన వ్యవహారాలు, క్రీడా మంత్రిత్వ శాఖ సహకారంతో నెహ్రూ యువకేంద్రం ఆధ్వర్యంలో సేవా సే సీకెన్ (సేవ ద్వారా నేర్చుకోవడం) కార్యక్రమాన్ని శుక్రవారం నగరంలోని పెద్దాస్పత్రిలో నిర్వహించారు. ఈ సందర్భంగా సిద్ధానాయక్ మాట్లాడుతూ ఆసక్తి గల నర్సింగ్ స్టూడెంట్స్‌ను ఎంచుకుని మైభారత్ పోర్టల్‌కు అనుసంధానం చేసి నెల రోజుల పాటు సేవా కార్యక్రమాలు చేపట్టేందుకు నెహ్రూ యువకేంద్రం ముందుకు రావడం సంతోషకరమన్నారు. కార్యక్రమంలో డిప్యూటీ సూపరింటెండెంట్ డాక్టర్ మస్తాన్‌బాషా, జిల్లా యువజన అధికారి మహేంద్రరెడ్డి, పీహెచ్‌పీ గౌరవాధ్యక్షుడు జయప్రకాష్, అధ్యక్షుడు శాఖవరపు వేణుగోపాల్, నెల్లూరు నర్సింగ్ స్కూల్ ట్యూటర్ సుప్రియ పాల్గొన్నారు.

ఇసుకను తక్కువ ధరకు అందిస్తాం

నెల్లూరు(సెంట్రల్) : జిల్లాలో తక్కువ ధరకే ఇసుకను అందిస్తామని రాష్ట్ర పురపాలక శాఖ మంత్రి పొంగూరు నారాయణ అన్నారు. నెల్లూరులోని మూడో డివిజన్ దీనదయాల్ నగర్‌లో లబ్ధిదారులకు పింఛన్ల పంపిణీ కార్యక్రమంలో ఆయన శుక్రవారం పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రస్తుతం అధిక ధరలకు ఇసుకను విక్రయిస్తున్నారని, వాటిని తగ్గించే విధంగా ప్రయత్నాలు చేస్తున్నామన్నారు. త్వరలో మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం పథకానికి కూడా శ్రీకారం చుడుతామన్నారు.

- నగరంలోని ఆత్మకూరు బస్టాండ్ వద్ద ఉన్న శ్రీపొట్టిశ్రీరాములు విగ్రహానికి మంత్రి నారాయణ పూలమాల వేసి నివాళులర్పించారు.

మాజీ ప్రధానికి నివాళి

నెల్లూరు(వీఆర్సీసెంటర్) : మాజీ ప్రధానమంత్రి ఇందిరా గాంధీ 40వ వర్ధంతి సందర్భంగా ఆమెకు కాంగ్రెస్ నాయకులు ఘన నివాళులర్పించారు. నగరంలోని ఇందిరాభవన్‌లో బుధవారం ఆమె విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. డీసీసీ అధ్యక్షుడు చేవూరు దేవకుమార్‌రెడ్డి, జిల్లా ఉపాధ్యక్షుడు తలారి బాలసుధాకర్ పాల్గొన్నారు.

నూరుశాతం పంపిణీకి చర్యలు

నెల్లూరు (పొగతోట) : జిల్లా వ్యాప్తంగా పింఛన్ల పంపిణీని నూరుశాతం పూర్తి చేసేలా చర్యలు చేపట్టామని కలెక్టర్ ఆనంద్ అన్నారు. నగరంలోని బట్వాడిపాళెంలో పింఛన్ల పంపిణీని ఆయన శుక్రవారం పరిశీలించారు. ఇప్పటివరకు 70 శాతం పంపిణీ జరిగిందన్నారు.

న్యాయ, మైనారిటీ సంక్షేమ శాఖ మంత్రి రాక రేపు

నెల్లూరు(దర్గామిట్ట): రాష్ట్ర న్యాయ, మైనారిటీ సంక్షేమ శాఖ మంత్రి, జిల్లా ఇన్‌చార్జి మంత్రి ఎన్ఎండీ ఫరూక్ ఈనెల 3వ తేదీ ఆదివారం జిల్లాకు రానున్నారు. ఆదివారం నంద్యాల నుంచి రోడ్డు మార్గాన ఉదయం 10 గంటలకు నెల్లూరుకు చేరుకుని జెడ్పీ సమావేశ మందిరంలో జరిగే జిల్లా సమీక్ష మండలి సమావేశంలో పాల్గొంటారు. 12.30 నుంచి 2 గంటల వరకు ఆర్‌అండ్‌బీ అతిథి గృహంలో ఉంటారు. మధ్యాహ్నం 2 నుంచి 3 గంటల వరకు మైనారిటీ సంక్షేమ అధికారులతో సమీక్ష నిర్వహిస్తారు. 3 నుంచి 4 గంటల వరకు వివిధ వర్గాల ప్రజలు, ప్రజాప్రతినిధులతో సమావేశమై 4.30కు రోడ్డు మార్గాన నంద్యాలకు వెళ్తారు.

వేదగిరిలో పూజలు

నెల్లూరు సిటీ : రూరల్ మండలం నరసింహకొండలోని వేదగిరి లక్ష్మీనరసింహస్వామి దేవస్థానంలో శుక్రవారం మూలవర్లకు అభిషేకం, తిరుప్పావడ సేవతో పాటు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు. ఈఓ వేమూరి గోపి, అర్చకులు భాస్కరాచార్యులు, కృష్ణమాచార్యులు తదితరులు పాల్గొన్నారు.

బంగారంతో ఉడాయింపు

నెల్లూరు(క్రైమ్) : ఆభరణాల తయారీకి ఇచ్చిన బంగారుతో ఓ వ్యక్తి ఉడాయించిన ఘటనపై చిన్నబజారు పోలీసులు కేసు నమోదు చేశారు. పోలీసుల సమాచారం మేరకు.. ద్రోణంరాజు వీధికి చెందిన డి.గురుకమల్ అదేప్రాంతంలో బంగారు దుకాణం నిర్వహిస్తున్నారు. ఆయన వినియోగదారుల నుంచి బంగారు ఆభరణాల ఆర్డర్స్ తీసుకునేవారు. కమాటివీధిలోని ప్రసన్యామాండల్‌కు బంగారం ఇచ్చి ఆభరణాలు తయారు చేయించేవారు. ఈ నేపథ్యంలో ఈఏడాది ఆగస్టు 2వ తేదీన గురుకమల్ 170 గ్రాముల బంగారాన్ని ఆభరణాల తయారీ కోసం ప్రసన్యామాండల్‌కు ఇచ్చారు. ఆ బంగారం తీసుకుని అతను ఊరు వదిలి పరారయ్యారు. అతని కుటుంబం సైతం వెళ్లిపోయింది. దీంతో బాధితుడు శుక్రవారం చిన్నబజారు పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

వ్యక్తి అదృశ్యం

నెల్లూరు(క్రైమ్) : వ్యక్తి అదృశ్యమైన ఘటనపై నవాబుపేట పోలీసులు గురువారం కేసు నమోదు చేశారు. పోలీసుల సమాచారం మేరకు.. జాకీర్ హుస్సేన్‌నగర్‌లో షేక్ అహ్మద్‌బాషా, సల్మా దంపతులు నివాసం ఉంటున్నారు. ఆయన బైక్ మెకానిక్‌గా పనిచేస్తూ కుటుంబాన్ని పోషించుకుంటున్నారు. ఈ క్రమంలో ఆయన చెడు వ్యసనాలకు బానిసయ్యారు. ఈ విషయమై గతనెల 24వ తేదీన దంపతుల నడుమ వాగ్వాదం చోటుచేసుకుంది. అదేరోజు ఇంటి నుంచి బయటకు వెళ్లిన ఆయన తిరిగి రాలేదు. కుటుంబ సభ్యులు అతని కోసం గాలించారు. జాడ తెలియరాలేదు. ఈమేరకు సల్మా గతనెల 31వ తేదీ గురువారం నవాబుపేట పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

యువకుల అనుచిత ప్రవర్తన

- కేసు నమోదు

నెల్లూరు(క్రైమ్) : ఆలయ పవిత్రతను దెబ్బతీసే విధంగా వ్యవహరించిన ఐదుగురు యువకులపై సంతపేట పోలీసులు కేసు నమోదు చేశారు. పోలీసుల సమాచారం మేరకు.. సంతపేట ఆంజనేయస్వామి దేవస్థానం వద్ద గత నెల 28వ తేదీ రాత్రి ఐదుగురు యువకులు అనుచితంగా ప్రవర్తించారు. ఓ యువకుడు తన దుస్తులను విప్పి పక్కనే ఉన్న డ్రెయినేజీ కాలువలో ముంచి మలిన దుస్తులను గుడివద్ద గల చిన్న హనుమంతుని విగ్రహంపై విసిరి పరారయ్యారు. 29వ తేదీన విగ్రహంపై మలిన దుస్తులు ఉండడాన్ని ఆలయ పూజారి గమనించి ఈఓ పి.రఘురామయ్యకు, ఆలయ ధర్మకర్తలకు తెలియజేశారు. దీనిపై ఈఓ గురువారం సంతపేట పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఎస్సై బాలకృష్ణ కేసు నమోదు చేశారు. సాంకేతికత ఆధారంగా నిందితులను గుర్తించి అదుపులోకి తీసుకున్నట్లు తెలిసింది.

అగ్నిమాపక అవినీతిపై నామమాత్రపు విచారణ

నెల్లూరు(క్రైమ్) : దీపావళి నేపథ్యంలో అగ్నిమాపక శాఖలో కొందరి వసూళ్లపై గుంటూరు ఆర్ఎఫ్ఓ నిర్వహించిన విచారణ తూతూ మంత్రంగా సాగిందన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. దీపావళి పండగ సందర్భంగా కొందరు అగ్నిమాపక సిబ్బందిపై అవినీతి ఆరోపణలు వెల్లువెత్తాయి. ఈవిషయం ఆ శాఖ డీజీ మాదిరెడ్డి ప్రతాప్ దృష్టికి వెళ్లడం, గుంటూరు రీజనల్ ఫైర్ ఆఫీసర్‌ను విచారణకు ఆదేశించడం తెలిసిందే. గతనెల 30వ తేదీన ఆర్ఎఫ్ఓ జిలానీ నెల్లూరుకు చేరుకున్నారు. అయితే ఆరోపణలు ఎదుర్కొంటున్న సిబ్బందికి అనుకూలమైన వ్యాపారులతో వారికి అనుకూలంగా విచారణాధికారికి స్టేట్‌మెంట్‌లు ఇప్పించారన్న ఆరోపణలున్నాయి. ఓ అధికారి అక్రమాలు జరిగాయని విచారణలో పేర్కొన్నప్పటికీ అతనిచేత అంతా సక్రమమే అని స్టేట్‌మెంట్ ఇప్పించారన్న ప్రచారం సాగుతోంది. ఓ లీడింగ్ ఫైర్‌మెన్ సెలవుపెట్టి అక్రమ వసూళ్లకు పాల్పడ్డారన్న ఆరోపణల నేపథ్యంలో అతన్ని రక్షించేందుకు ఆశాఖ ఉన్నతాధికారులు రంగంలోకి దిగినట్లు ప్రచారం సాగుతోంది. ఏకంగా జనరల్ డైరీలో వివరాలను నమోదు చేసిన పేజీని సైతం మాయం చేశారన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఈ మొత్తం వ్యవహారంలో వాస్తవాలు బహిర్గతం కావాలంటే లోతుగా విచారణ సాగాల్సి ఉందని అగ్నిమాపకశాఖలోని సిబ్బందే పేర్కొంటున్నారు.

సమస్యల పరిష్కారానికి వినతి



డీఈఓకు వినతిపత్రం అందజేస్తున్న పీఆర్టీయూ నేతలు

నెల్లూరు (టౌన్) : జిల్లా విద్యాశాఖ కార్యాలయంలో డీఈఓ ఆర్.బాలాజీరావును పీఆర్టీయూ నాయకులు శుక్రవారం మర్యాదపూర్వకంగా కలిసి సత్కరించారు. అనంతరం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా పీఆర్టీయూ నాయకులు మాట్లాడుతూ పాఠశాలల్లో ఉపాధ్యాయులను సర్దుబాటు చేసినా చాలా స్కూల్స్‌లో సబ్జెక్టు టీచర్ల కొరత ఉందన్నారు. బిట్రగుంట హైస్కూల్‌లో సోషల్, అప్పసముద్రం జెడ్పీహెచ్ఎస్‌లో మ్యాథ్స్, కాకొల్లువారిపల్లెలోని జెడ్పీహెచ్ఎస్‌లో మ్యాథ్స్ సైన్స్ ఉపాధ్యాయులు లేరని చెప్పారు. ఈ సమస్యను వెంటనే పరిష్కరించి పదో తరగతి విద్యార్థులకు న్యాయం చేయాలని కోరారు.

భక్తిశ్రద్ధలతో అభిషేక మహోత్సవం



అభిషేక మహోత్సవాన్ని జరిపిస్తున్న అర్చకులు

నెల్లూరు(బృందావనం) : బాలాజీనగర్‌లోని సీతారామ స్వామి మందిరంలో శ్రీదేవి, భూదేవి సమేత కల్యాణ వేంకటేశ్వరస్వామికి శుక్రవార అభిషేక మహోత్సవాన్ని భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. వేద మంత్రోచ్చారణలు, గోవిందనామస్మరణలు, భక్తి సంకీర్తనలు, మంగళవాయిద్యాలతో స్వామివారికి మందిర ప్రధానార్చకుడు బృందావనం శ్రీనివాస దీక్షితులచే పసుపు, గంధం, పెరుగు, తేనె, నారికేళ జలంలో పంచామృతాభిషేకాలు చేశారు. అభిషేక మహోత్సవంలో పాల్గొన్న భక్తుల్లో ఐదుగురిని లాటరీ ద్వారా ఎంపిక చేసి అమ్మవారి వస్త్రాలను కానుకగా అందజేశారు. ఉభయకర్తలుగా కర్తం ప్రతాప్‌రెడ్డి, జ్యోతి దంపతులు వ్యవహరించారు. కార్యక్రమంలో 16వ డివిజన్ కార్పొరేటర్ వేనాటి శ్రీకాంత్‌రెడ్డి, మందిర కమిటీ నిర్వాహకులు కిశోర్, అమర మోహన్‌రావు, ఎస్వీ రత్నం, తన్నీరు మస్తాన్‌రావు, ఆంజనేయులుగుప్తా, సమితి సభ్యులు రమణకుమార్, రామాంజనేయరెడ్డి, దినేష్‌రెడ్డి, దామోధర్‌రెడ్డి, రేణుక శ్రీను, కొండారెడ్డి, సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

600 ఎస్జీటీ పోస్టులను ప్రకటించాలి



విద్యాశాఖ కార్యాలయం ముందు ఎస్జీటీ అభ్యర్థులు

నెల్లూరు (టౌన్) : మెగా డీఎస్సీలో జిల్లాకు సంబంధించి 600 ఎస్జీటీ పోస్టులను ప్రకటించాలని ఎస్జీటీ అభ్యర్థులు కోరారు. ఈ మేరకు వారు జిల్లా విద్యాశాఖ కార్యాలయం ముందు శుక్రవారం ఆందోళన వ్యక్తం చేశారు. అనంతరం ఏడీ గ్లోరీని కలిసి వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ జిల్లాకు తక్కువ ఎస్జీటీ పోస్టులు చూపుతున్నారన్నారు. దీనిపై డీఈఓను పలుమార్లు కలిసి పోస్టులను పెంచాలని విన్నవించినట్లు పేర్కొన్నారు. రాష్ట్ర ప్రభుత్వం మెగా డీఎస్సీని ప్రకటించక ముందే జిల్లాలో ఎస్జీటీ పోస్టులు పెంచి తమకు న్యాయం చేయాలని కోరారు. లేకుంటే వందలాది మంది నిరుద్యోగులు వీధిన పడుతారని ఆవేదన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో ఎస్జీటీ అభ్యర్థులు అనిల్‌కుమార్, ప్రశాంత్, మల్లికార్జున, ఈశ్వరయ్య తదితరులు పాల్గొన్నారు.

అమరజీవికి ఘన నివాళి



అమరజీవికి నివాళులర్పించిన కాకాణి, పార్టీ నేతలు



నివాళులర్పించిన ఎమ్మెల్సీ చంద్రశేఖర్‌రెడ్డి



పొట్టిశ్రీరాములు విగ్రహానికి నివాళులర్పించిన మేయర్ స్రవంతి

నెల్లూరు(బారకాసు) : ఆంధ్ర రాష్ట్ర అవతరణ దినోత్సవం సందర్భంగా అమరజీవి శ్రీపొట్టి శ్రీరాములుకు మాజీ మంత్రి, వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు కాకాణి గోవర్ధన్‌రెడ్డి శుక్రవారం ఘన నివాళులర్పించారు. నగరంలోని డైకస్‌రోడ్డులో ఉన్న తన క్యాంపు కార్యాలయంలో అమరజీవి చిత్రపటానికి పూలమాల వేసి మాట్లాడారు. ఆంధ్ర రాష్ట్ర అవతరణ కోసం ప్రాణత్యాగం చేసిన పొట్టిశ్రీరాములుకు సీఎం చంద్రబాబు నివాళులర్పించకపోవడం బాధాకరమన్నారు. గతంలో జగన్‌మోహన్‌రెడ్డి తన ఐదేళ్ల పాలనలో ప్రతి సంవత్సరం నవంబరు 1వ తేదీన అమరజీవి సంస్మరణ సభలు నిర్వహించడంతో పాటు, రాష్ట్ర అవతరణ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించినట్లు గుర్తుచేశారు.

- నగరంలోని రామ్‌జీనగర్‌లో ఉన్న వైఎస్సార్‌సీపీ సిటీ నియోజకవర్గ కార్యాలయంలో ఎమ్మెల్సీ, పార్టీ సిటీ నియోజకవర్గ ఇన్‌చార్జి పర్వతరెడ్డి చంద్రశేఖర్‌రెడ్డి పొట్టిశ్రీరాములు చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్పొరేటర్ కామాక్షిదేవి, పార్టీ నేతలు కిషన్, సాయి, గిరీష్, పేర్నేటి కోటేశ్వరరెడ్డి, నిజాముద్దీన్, ఉమారెడ్డి, శేషసాయి, తౌఫిక్, కుమార్‌రెడ్డి పాల్గొన్నారు.
- స్థానిక ఆత్మకూరు బస్టాండ్ ప్రాంతంలో ఉన్న అమరజీవి పొట్టిశ్రీరాములు విగ్రహానికి నగర మేయర్ పొట్లూరి స్రవంతి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో చొటురు శ్రీనివాసులు, సిరాజ్, షఫి పాల్గొన్నారు.

పొట్టిశ్రీరాములు పేరును కొనసాగించాలి

నెల్లూరు(వీఆర్సీసెంటర్) : హైదరాబాద్‌లోని తెలుగు యూనివర్సిటీకి పొట్టిశ్రీరాములు పేరును కొనసాగించాలని కాంగ్రెస్ నాయకులు డిమాండ్ చేశారు. నగరంలోని ఆత్మకూరు బస్టాండ్ వద్ద ఉన్న పొట్టిశ్రీరాములు విగ్రహానికి వారు శుక్రవారం పూలమాలలు వేసి నివాళులర్పించారు. తెలంగాణ ప్రభుత్వం అక్కడి యూనివర్సిటీకి ఉన్న పొట్టిశ్రీరాములు పేరును తొలగిస్తామని చెప్పడం బాధాకరమన్నారు. దీనిపై ఏపీ రాష్ట్ర ప్రభుత్వం జోక్యం చేసుకోవాలని డిమాండ్ చేశారు. నాయకులు సంజయ్ కుమార్, సుధీర్, ముజీబ్, సుధాకర్‌రెడ్డి, గిరీష్, కృష్ణ పాల్గొన్నారు.

- నెల్లూరు రూరల్ : మూలపేటలోని శ్రీపొట్టిశ్రీరాములు విగ్రహానికి బీజేపీ నేత మిడతల రమేష్ ఆధ్వర్యంలో శుక్రవారం ఘన నివాళులర్పించారు. పార్టీ నాయకులు అల్లూరు నాగేంద్రసింగ్, చంద్ర, వీర రాఘవులు, నీలిశెట్టి లక్ష్మణరావు తదితరులు పాల్గొన్నారు.

8 నుంచి లక్ష దీపోత్సవం



బ్రోచర్‌ను ఆవిష్కరిస్తున్న వేమిరెడ్డి దంపతులు

నెల్లూరు(దర్గామిట్ట) : కార్తీక మాసం సందర్భంగా నవంబర్ 8వ తేదీ నుంచి 10వ తేదీ వరకు నెల్లూరు వీఆర్సీ మైదానంలో నిర్వహించే లక్ష దీపోత్సవ కార్యక్రమానికి సంబంధించిన బ్రోచర్‌ను ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, ఎమ్మెల్యే ప్రశాంతి రెడ్డి శుక్రవారం ఆవిష్కరించారు. నగరంలోని మాగుంట లేఅవుట్‌లో ఉన్న వీపీఆర్ నివాసంలో నిర్వహించిన బ్రోచర్ ఆవిష్కరణ సందర్భంగా వారు మాట్లాడారు. భక్తులు విశేషంగా తరలి రావాలని కోరారు.